సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం : 31 : మే : 2025



కూటమి పాలనలో అభివృద్ధి శూన్యం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి ముందుకు సాగడం లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల విమర్శించారు. -10లో



పక్కాగా 'యోగాంధ్ర'

ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు 'యోగాంధ్ర- 2025 కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.9/27.8

జిల్లాలో శుక్రవారం 27.8 - 32.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

క్యాన్సర్ కేర్ సెంటర్ ఏఓగా గోపాల్‌రెడ్డి



కడప రూరల్: ప్రభుత్వ క్యాన్సర్ కేర్ సెంటర్ ఏఓగా రాచమల్లి గోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈయన వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పదోన్నతిపై కడప ప్రభుత్వ క్యాన్సర్ కేర్ సెంటర్ ఏఓ (పరిపాలనా అధికారి)గా నియమితులయ్యారు. గోపాల్‌రెడ్డికి పదోన్నతి లభించడం పట్ల సహచర ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియామకాలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లాకు చెందిన పలువురు నాయకులను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో వివిధ హోదాలలో నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా షేక్ షఫీవుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షేక్ ఇస్మాయిల్, రాష్ట్ర కార్యదర్శిగా ఎస్.రఘురామిరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా ఎం.గురుప్రసాద్, ఎస్.భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ విభాగం ఉపాధ్యక్షులుగా వై.జనార్దన్‌రెడ్డిలను నియమించారు.

ఏనుగు హల్‌చల్

పీలేరు: మండలంలోని జాండ్ల, గూడరేవుపల్లె పరిసర గ్రామాల్లో ఒంటరి ఏనుగు హల్‌చల్ చేయడంతో ప్రజలు భయాందోళనలో ఉన్నారు. యర్రావారిపాళెం మండలంలో ఫారెస్ట్ అధికారులు సైతం గాయపడ్డారు. ఈ క్రమంలో శుక్రవారం మండలంలోని జాండ్ల పంచాయతీలో ఒంటరి ఏనుగు సంచరించినట్లు గ్రామస్తులు గుర్తించారు. నారుమడి తొక్కిన ఏనుగు అడుగులు, అరటి తోట ధ్వంసం చేసినట్లు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ అధికారులు, పోలీసులు జాండ్లలో పర్యటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

2న జెడ్పీ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పని చేస్తున్న ఎంపీడీఓల క్యాడర్ నుంచి అటెండర్/వాచ్‌మెన్ వరకు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి జూన్ 2న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని జెడ్పీ సీఈఓ ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 వరకు పరిపాలన అధికారులు, సీనియర్ సహాయకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు రికార్డు అసిస్టెంట్లు, ఆఫీసు సబార్డినేట్లు, వాచ్‌మెన్లకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. సాయంత్రం 4 నుంచి 5 వరకు మండల పరిషత్ అధికారులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. కావున ఒకే కేంద్రంలో ఐదేళ్లు పని చేసిన వారు, రిక్వెస్ట్ బదిలీలు కోరిన ఉద్యోగులంతా జూన్ 2న జిల్లా పరిషత్ సమావేశ భవనంలో హాజరు కావాలని ఆమె కోరారు.

ఆడబిడ్డ నిధి.. అమలు ఏదీ?

- ఏడాదైనా నెరవేరని హామీ
- ఎదురుచూస్తున్న అక్కాచెల్లెమ్మలు
- కూటమి సర్కారు తీరని ద్రోహం
- జగనన్న సర్కారులో మహిళలే మహారాణులు



చంద్రబాబు సర్కారులో జిల్లాలోని అర్హులకు అందాల్సిన సొమ్ము వివరాలు

పథకం పేరు	జిల్లాలో అర్హులైన లబ్ధిదారులు	అందాల్సిన మొత్తం	కాలం
ఆడబిడ్డ నిధి	7,06,974 (18 ఏళ్ల నిండిన మహిళలు)	రూ.106.05 కోట్లు	ప్రతి నెల
తల్లికి వందనం	3.58 లక్షలు విద్యార్థులు	రూ.538.24 కోట్లు	ఏడాది
ఉచిత ప్రయాణం	38,700 (రోజూ ప్రయాణిస్తున్న మహిళలు)	ఒకరికి రూ.100 చొప్పున రూ.38.7 లక్షలు	ప్రతి రోజు

సాక్షి ప్రతినిధి, కడప: ఆ మనిషేం మారలేదు. మారిన మనిషినంటూ జనాన్ని నమ్మించారు. ఓట్లు దండుకున్నారు. అధికారమే పరమావధిగా.. ముఖానికేసుకున్న అపద్ధాల హామీల ముసుగు తొలగిపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిజస్వరూపం తక్కువ కాలంలోనే బహిర్గతమైంది. 'నాడు-నేడు' వెలుగు కరిగిపోయి, విద్యా వ్యవస్థకు చంద్రగ్రహణం ఆవహించింది. అవును, బాబు మాటలు నీటి మూటలేనని మరోసారి రుజువయ్యాయి. తల్లికి వందనమంటూ ఇప్పటికీ ఊరిస్తున్నారు. నిరుద్యోగ భృతి అందని ద్రాక్ష పుల్లన అన్నట్లుగా ఉండిపోయింది. కర్షకులకు కన్నీరు తుడుస్తానంటూ.. పెట్టుబడి సాయం మాటే మర్చిపోయారు. 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు రూ.1500లు ఊసేలేదు. ఆడబిడ్డ నిధి మాటే ఎత్తడం లేదు. మహానాడు వేదికగా ఆ విషయాన్ని ప్రస్తావించలేదు. 'బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ' కాదు 'బాబును నమ్మితే మోసం గ్యారెంటీ' అని రుజువు చేశారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

ఊరువాడా ఊదరగొట్టి..

18 ఏళ్లు నిండిన యువతి నుంచి 59 ఏళ్ల వరకు వయసు గల ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఆడబిడ్డ నిధి చెల్లిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఊరువాడా చెప్పుకొచ్చారు. ఎన్నికలకు ఏడాది మునుపు 'బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ' అంటూ ఊదరగొట్టారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి తీరుతామని ప్రతి యువతి, మహిళకు ఏడాదికి రూ.18 వేలు చెల్లిస్తామని చెప్పారు. అక్కచెల్లెమ్మల మనసు టీడీపీ వైపు మొగ్గు చూపేలా వ్యవహరించారు. ఆపై ఓట్లు దండుకున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇప్పటికీ ఆడబిడ్డ నిధి గురించి ఆలోచనే చేయలేదు. మహానాడు వేదికగా ప్రకటిస్తారని భావించిన అక్కచెల్లెమ్మలకు నిరాశే ఎదురైంది. కామధేనువు లాంటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారును పోగొట్టుకొన్నామని మథనపడుతున్నారు.

అమలు చేసింటే రూ.1272 కోట్లు దక్కేది

18 ఏళ్లు నిండిన ప్రతి యువతికి ఆడబిడ్డ నిధిగా రూ.1500 చొప్పున టీడీపీ సర్కారు చెల్లించి ఉంటే ఏడాది కాలానికి రూ.18 వేలు వచ్చేది. జిల్లా వ్యాప్తంగా 7,06,974 మంది మహిళలు ఈ పథకానికి అర్హులు కానున్నారు. అంటే ప్రతి నెలా రూ.106.05 కోట్లు.. యువతులు, మహిళలకు చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన ఏడాది కాలానికి రూ.1272.6 కోట్లు దక్కేది. చంద్రబాబు సర్కారు మోసం కారణంగా.. ఆ మొత్తాన్ని మహిళాలోకం కోల్పోయింది. మహిళలు ఆత్మభిమానంతో జీవించాలని, సమాజంలో ఆత్మగౌరవం పెంచేందుకు మునుపటి వైఎస్సార్‌సీపీ సర్కారు అడుగులు వేస్తే.. సీఎం చంద్రబాబు సర్కారు తద్భిన్నంగా వ్యవహరిస్తూ ఏకంగా మహిళాలోకాన్ని వంచనకు గురిచేశారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కాగా, ఇంట్లో ఎంత మంది విద్యార్థులు చదువుతూ ఉంటే అందరికీ రూ.15 వేల చొప్పున 'తల్లికి వందనం' ద్వారా అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏడాదైనా ఆ హామీ ఇప్పటికీ నెరవేరలేదు. రాబోవు జూన్‌లో ఇస్తామని మహానాడు వేదికగా మరోమారు ప్రకటించారు. చెప్పిన మాట చెప్పినట్లుగా అమలు చేస్తే జిల్లాలో 3.58 లక్షల మంది విద్యార్థులకు రూ.538 కోట్లు చెల్లించాల్సి ఉంది. పథకం అమలులో ఎలాంటి నిబంధనలు తెరపైకి వస్తాయో వేచిచూడాలి.

ఉచిత బస్సు 'అదిగో.. ఇదిగో' అంటూ..

మహిళలకు ఆర్టీసీ ద్వారా ఉచిత ప్రయాణం సదుపాయాన్ని కల్పిస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. మహిళలు ఇకపై ఎక్కడికెళ్లినా ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని ఆశించారు. ఈ హామీ అమలు 'ఇదిగో.. అదిగో' అంటూ కాలం గడుపుతున్నారు. జిల్లాలో 6 ఆర్టీసీ బస్సు డిపోల ద్వారా 590 బస్సులు ప్రజా రవాణాలో ఉన్నాయి. సరాసరి ప్రతి రోజు 1.29 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. వారిలో 30 శాతం మంది మహిళలు ప్రతి రోజు ప్రయాణించున్నారని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే 38,700 మంది మహిళలు ప్రయాణిస్తున్నారు. తక్కువలో తక్కువంటే సరాసరిగా రూ.100 చార్జీలు చెల్లిస్తున్నారనుకున్నా, ప్రతి రోజు రూ.38.7 లక్షలు మహిళలు చార్జీల రూపేణా భరిస్తున్నారు. అంటే నెలకు రూ.116 కోట్లు మహిళలు భరిస్తున్నారని నిపుణులు వివరిస్తున్నారు.

నాడు గలగల.. నేడు వెలవెల

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మహిళలు మహారాణులుగా విరాజిల్లుతూ వచ్చారని విశ్లేషకులు వివరిస్తున్నారు. అమ్మఒడి పథకం ద్వారా 2,16,222 మందికి రూ.912 కోట్లు నాలుగేళ్లలో లభించింది. స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీ రూపేణా మరో రూ.190 కోట్లు అందించారు. మరోవైపు కోట్లాది రూపాయాలు వెచ్చించి.. ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు మహిళల పేరిట రిజిస్ట్రేషన్ పత్రాలు అందించారు. మహిళలు మహారాణులుగా అటు సమాజంలో.. ఇటు సొంత ఇళ్లలో గౌరవం పెంచే చర్యలను నాటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ వ్యవహరించిందని విశ్లేషకులు వివరిస్తున్నారు.

ఇంకెప్పుడు ఇస్తారు?



అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా.. ఆడబిడ్డ నిధి ఊసే లేదు. అసలు పథకం అమలు చేస్తారా? లేదా? నెలకు రూ.1500 చొప్పున ఇస్తామన్న సంగతి చంద్రబాబుకు గుర్తుందా? ఇప్పటికైనా ఇవ్వాలి. – సరోజ, కమలాపురం

ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు



వైఎస్సార్‌సీపీ హయాంలో మహిళలందరూ మహారాణులుగా ఉండేవారు. కానీ కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదు. – వనజమ్మ, లింగాలదిన్నెపల్లె, బి.మఠం

ఉచిత బస్సు తుస్సు



టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత బస్సు తుస్సు అయింది. – గురుదేవి, ధన్నవాడ, మైలవరం మండలం

పథకాలు పేర్లకే పరిమితం



మహిళలను మోస పుచ్చేందుకు చంద్రబాబు సంక్షేమ పథకాలకు ఆకర్షణీయమైన పేర్లు పెట్టారు. అధికారం పీఠం ఎక్కాక వాటిని అమలు చేయడం మరిచారు. – గుర్రం లావణ్య, కౌన్సిలర్, ప్రొద్దుటూరు

'వెన్నుపోటు' దినం.. కదం తొక్కుదాం

- 4న అన్ని నియోజకవర్గాల్లో ఆందోళనలు
- ప్రజల భాగస్వామ్యంతో వైఎస్సార్‌సీపీ ర్యాలీలు
- జయప్రదం చేయాలని పిలుపునిచ్చిన పార్టీ నేతలు
- సెల్ఫ్ డబ్బా కొట్టుకోవడానికే 'మహానాడు' నిర్వహించారని విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు జూన్ 4న 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం వైఎస్సార్ జిల్లా కడపలోని పార్టీ కార్యాలయంలో కడప పార్లమెంటు పరిశీలకులు కె.అజయ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మేయర్ కె.సురేష్ బాబు, ఎమ్మెల్సీలు డీసీ గోవిందరెడ్డి, పి. రామసుబ్బారెడ్డి, ఎంపీ రామచంద్రారెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తొలుత పి.రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ 2024 జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. 2025 జూన్ నాటికి ఏడాది పూర్తవుతుందని, ఈ ఏడాది కాలంలో ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. సూపర్ సిక్స్‌తోపాటు 143 ఇతర హామీలు ఇచ్చి ప్రజలను దారుణంగా మోసం చేశారన్నారు. దీన్ని నిరసిస్తూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీలు చేపట్టి, అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహానాడుకు డ్వాక్రా మహిళల తరలింపు

రాష్ట్రంలో ప్రజల అవసరాలు గుర్తెరిగి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దివంగత ఎన్‌టీఆర్, వైఎస్సార్ ట్రెండ్ సెట్టర్స్‌గా నిలిచారని, వారి తర్వాత అనేక వినూత్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. సుమారు 20 ఏళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు పేరు చెబితే గుర్తుకు వచ్చే ఒక్క సంక్షేమ పథకం లేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అంటే మోసం, దగా, వెన్నుపోటు, అబద్ధాలే గుర్తుకు వస్తాయన్నారు. ఎన్నికల ముందు చదువుకునే ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి ఎన్నో హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. పైగా వలంటీర్లు, రేషన్ వాహనాల డ్రైవర్ల ఉద్యోగాలు ఊడగొట్టారన్నారు. ఆత్మస్తుతి పరనిందలాగా సెల్ఫ్ డబ్బా కొట్టుకుని, వైఎస్ జగన్‌ను తిట్టడానికే మహానాడు కార్యక్రమాన్ని కడపలో ఏర్పాటు చేశారన్నారు. మహానాడుకు డ్వాక్రా మహిళలను, ఉపాధి కూలీలను భయపెట్టి బస్సుల్లో తరలించారన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రతి ఒక్కరూ రాసుకుంటున్నారని, సరైన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

కరోనా విస్తరిస్తుందని చెబుతున్నా..

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఓడిపోయిందని ప్రజలు బాధపడుతున్నారన్నారు. సంపద సృష్టిస్తా, పేదలను ధనవంతులుగా చేస్తా, అభివృద్ధిని అందలం ఎక్కిస్తానంటూ కాకమ్మ కబుర్లు చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక కరెంటు బిల్లులు విపరీతంగా పెంచారని, నిత్యావసర ధరలు ఆకాశాన్నంటేలా చేశారన్నారు. కరోనా విస్తరిస్తుందని చెబుతున్నా వినకుండా మహానాడు నిర్వహించారన్నారు. ప్రయాణికులకు బస్సులు లేకుండా చేసి మహానాడుకు అన్ని బస్సులు తరలించారన్నారు. 50 ఏళ్లుగా ఈ జిల్లా ప్రజలు వైఎస్ కుటుంబాన్ని గెలిపిస్తూ వస్తున్నారని, ఒక్కసారి గెలిపించినందుకే ఇది మా అడ్డా అని టీడీపీ నాయకులు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ వెళ్లి చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, నాయకులు పులి సునీల్, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, దాసరి శివప్రసాద్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

1న క్యారమ్స్ పోటీలు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా స్థాయిలో జూన్ 1న క్యారెమ్స్ గేమ్ టోర్నమెంట్‌ను కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కడప జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ సెక్రటరీ రాజీ, కోచ్ గణేష్‌బాబు, కృష్ణయ్య తెలిపారు. అండర్ 11, 14, 17, 19 బాలురు, బాలికలు, సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ కేటగిరీల్లో పోటీలు జరుగుతాయని వారు పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే వారు ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు తీసుకుని రావాలన్నారు. ఎంపికైన వారు రాబోయే రోజుల్లో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్: 8297059998కు సంప్రదించాలని వివరించారు.

1న బాస్కెట్‌బాల్ ఎంపికలు

కడప జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 1న 6.30 గంటలకు కడప జయనగర్ జెడ్పీ బాలికల హైస్కూల్‌లో అండర్ 23 బాస్కెట్ బాల్ స్త్రీ, పురుషుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు బాస్కెట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు సహదేవరెడ్డి తెలిపారు. 2002 జూన్ 1వ తేదీ తర్వాత పుట్టిన వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన వారు జూన్ 4 నుంచి 6 వరకు చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి అండర్ 23 బాస్కెట్‌బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఒరిజినల్ ఆధార్‌కార్డు లేనిది ఎంపికలకు అనుమతించరని వివరించారు.


వైద్య ఉద్యోగులు.. బదిలీల గుబులు

ఇటీవల ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వైద్య,ఆరోగ్య శాఖలు అవినీతిమయంగా మారాయని ఆరోపించారు. కొన్ని కేడర్‌లకు చెందిన ఉద్యోగులను మూడేళ్ల సర్వీసు దాటితే బదిలీ చేయాలని చెప్పారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్స్‌కు పచ్చ జెండా ఊపింది. అయితే వైద్య ఆరోగ్య శాఖకు ఇంత వరకు గైడ్‌లైన్స్‌ను జారీ చేయకపోవడంతో ఉత్కంఠగా మారింది.

- ప్రభుత్వ ఉద్యోగుల స్థానచలనానికి గ్రీన్‌సిగ్నల్
- వైద్య ఆరోగ్యశాఖకు అందని గైడ్‌లైన్స్
- ఆలస్యంతో మరింత ఆందోళన
- ఉన్న స్థానంలోనే కొనసాగడానికి విశ్వప్రయత్నాలు



వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం



కడప రూరల్: ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫలితంగా ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖల్లో బదిలీల ప్రక్రియ ముగిసింది. అయితే వైద్య ఆరోగ్య శాఖకు ఇంత వరకు గైడ్‌లైన్స్ రాలేదు. దీంతో ఆ శాఖ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల బదిలీల తంతు ముందుకు సాగడం లేదు.

వేలాది మంది ఉద్యోగులు..

ప్రభుత్వ శాఖల్లో వైద్య ఆరోగ్య శాఖ కీలకమైనది. కడప పాత రిమ్స్‌లోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్-4) పరిధిలో రాయలసీమలోని అన్ని జిల్లాల్లో దాదాపు 17 కేడర్‌లకు సంబంధించి 12 వేల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో అధిక సంఖ్యలో వివిధ కేడర్‌లకు చెందిన ఉద్యోగులు ఈ శాఖ పరిధిలోకే వస్తారు. ప్రభుత్వం ఇటీవల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఇంత వరకు ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ రాలేదు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 143 జీఓ ప్రకారం చర్యలు చేపట్టాలి. అంటే ఒక కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ నుంచి క్షేత్ర స్థాయి కేడర్ వరకు 14 మంది ఉద్యోగులు ఉండేలా వైద్య సిబ్బందిని సర్దుబాటు చేయాలి. ఈ సర్దుబాటు అంశం ఒక కొలిక్కి రాలేదు. ఈ కారణం చేత బదిలీలు కూడా ఆలస్యమవుతున్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఆ ఉద్యోగులకు మూడేళ్లు దాటితే బదిలీ

వైద్యఆరోగ్య శాఖ అవినీతిమయం అయిందని స్వయంగా మంత్రినే ప్రకటించడంతో.. ఆ శాఖను ప్రక్షాళన చేసే దిశగా కసరత్తు చేస్తున్నారు. సాధారణంగా ఐదేళ్లు ఒకే చోట సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులందరినీ బదిలీ చేయాలి. అయితే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ప్రాంతీయ కార్యాలయాలు, ఇతర విభాగాల్లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్‌తోపాటు కొన్ని కేడర్‌లకు చెందిన ఉద్యోగులను మూడేళ్ల సర్వీసు దాటితే.. తప్పనిసరిగా బదిలీ చేయాలని ఆదేశించారు. అలాగే భార్య,భర్తలు ఉద్యోగాలు చేస్తున్నా, దివ్యాంగులు ఉన్నా నిబంధనల ప్రకారం బదిలీలు చేపట్టాలి.

అనుకూలమైన స్థానంలో ఉండటానికి..

ట్రాన్స్‌ఫర్స్‌లో భాగంగా ఉద్యోగులు తమకు అనుకూలమైన చోటికి వెళ్లడానికి, వీలు పడితే ఉన్న స్థానంలోనే ఉండిపోవడానికి ఆలోచిస్తున్నారు. అలాగే కొందరు మంచి స్థానాల్లోకి రావడానికి పావులు కదుపుతున్నారు. గుర్తింపు కలిగిన ఉద్యోగ సంఘాల్లో ఉన్న సభ్యులకు.. నిబంధనల ప్రకారం బదిలీల నుంచి మినయింపు ఉంది. కొందరు ఉద్యోగులు తమ పరపతి, పలుకుబడిని ఉపయోగించి ఈ సంఘాల్లో పని చేస్తున్నట్లుగా లేఖను పొంది.. స్థానికంగానే ఉండటానికి ప్రయత్నాలు సాగిస్తున్నట్లుగా సమాచారం. ఈ శాఖ ఉద్యోగుల్లో గైడ్‌లైన్స్ అంశం ఉత్కంఠను రేపుతోంది.

గైడ్‌లైన్స్ ప్రకారం బదిలీలు



ఇంకా ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ రాలేదు. మార్గదర్శకాలు వస్తే వాటి ప్రకారం బదిలీలను చేపడుతాం. ప్రభుత్వ ఆదేశాలు రాగానే నిబంధనల ప్రకారం బదిలీల ప్రక్రియను చేపడుతాం. – డాక్టర్ రామగిడ్డయ్య, రీజినల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

క్లుప్తంగా

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని సర్వజన ఆసుపత్రికి తీవ్ర అనారోగ్యంతో బత్తల చిన్నా (35) అనే పేరుతో ఈనెల 28న ఓ వ్యక్తిని వైద్యం కోసం చేర్పించారు. అతడు శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అతని ఆచూకీ తెలిసిన వారు తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

యువతిపై దాడి కేసులో విచారణ

ముద్దనూరు : మండలంలోని నల్లబల్లె గ్రామంలో గురువారం సాయంత్రం హరిణి అనే యువతిపై కత్తితో దాడి చేసిన కేసులో పోలీసులు విచారణ చేపట్టారు. శుక్రవారం సీఐ దస్తగిరి తమ సిబ్బందితో కలిసి సంఘటన జరిగిన నల్లబల్లె గ్రామంలోని యువతి ఇంటికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. సెల్‌ఫోన్ నంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టినందుకు క్రాంతి కుమార్ అనే యువకుడు హరిణి ముఖంపై కత్తితో దాడిచేసి గాయపరచాడు.దీనిపై కేసు నమోదు చేసి బాధితురాలిని సీఐ విచారించారు. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

సెల్ టవర్‌పై నుంచి కిందపడి యువకుడి మృతి



మృతి చెందిన శివసాయి

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలోని దొండపాడు రస్తాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్‌పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి ముద్ద శివసాయి(27) అనే యువకుడు మృతి చెందాడు. శుక్రవారం ఉదయం శివసాయి సెల్ టవర్ ఎక్కి పనులు చేస్తుండటగా ప్రమాదవశాత్తు తాడు విరిగిపోవడంతో కింద పడి మరణించినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడు శివసాయి వేంపల్లి మండలం అలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించారు. ఎర్రగుంట్ల పోలీసులు మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్ మృతి

కడప అర్బన్ : కడప – ఒంటిమిట్ట రహదారిలో ఈనెల 28వ తేదీన రాత్రి ఆటో నడుపుకుంటూ ఇంటికి వెళుతున్న ఆటో డ్రైవర్ పెయ్యాల శ్రీనివాసులు (40) అనే వ్యక్తిని కడప కేంద్ర కారాగారం సమీపంలోని సైనిక్‌నగర్ వద్ద గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈసంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కడప ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి ఈనెల 29న పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళకు తీవ్రగాయాలు

మదనపల్లి రూరల్ : బైక్‌పై నుంచి పడి మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. పీటీయంకు చెందిన ఇమ్రాన్‌బాషా భార్య హసీనా(48) కుమారుడు ముజాహిద్దీన్‌తో కలిసి మదనపల్లెకు ద్విచక్రవాహనంలో వస్తుండగా, మార్గమధ్యంలోని కురబలకోట మండలం దొమ్మన్నబావి వద్ద ఆమె కట్టుకున్న చీర బైక్ వెనుకచక్రంలో చిక్కుకుపోవడంతో అదుపు తప్పి వాహనంపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడింది.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

- రాష్ట్రంలో వైఎస్ జగన్ చేసిన అభివృద్ధి పనులు ప్రజల ముందుకు తెస్తాం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల



పులివెందులలో ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల, తదితరులు



కాలేటివాగు ప్రాజక్టును పరిశీలిస్తున్న వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల

పులివెందుల : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులను నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల పేర్కొన్నారు. శుక్రవారం వైఎస్సార్ జిల్లా పులివెందులలోని మెడికల్ కళాశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 5ఏళ్ల కాలంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అభివృద్ధి కార్యక్రమాలన్నింటినీ ప్రజలకు చూపించే భాగంలో శుక్రవారం పులివెందుల నుంచి ఆ కార్యక్రమాలను చూడటం జరిగిందని, గండి ఆంజనేయస్వామి ఆలయం నుంచి మొదలుపెట్టుకుని ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించినట్లు చెప్పారు. ఏ ప్రభుత్వమైన సరే విద్య, వైద్య విధానాలపై దృష్టి సారిస్తే రాష్ట్రాభివృద్ధికి మంచి జరుగుతుందనే విషయాన్ని గత ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించిందన్నారు. రూ.8,500కోట్ల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా 17మెడికల్ కళాశాలలను స్థాపించాలన్న ఉద్యమంలో ఈ కళాశాలకు రూ.530కోట్ల నిధులను వెచ్చించి నిర్మించారన్నారు. ఎంత పెద్ద కళాశాల, ఇంత మంచి కళాశాలకు 100సీట్లు కేటాయించాలని చెప్పి ఎన్ఎంసీ పర్మిషన్ కోసం అప్లయ్ చేసి ఆ టైంలో వంద కాదు, 50సీట్లు అంటే... సరే 50 సీట్లతో కళాశాలను రన్ చేయాలనే క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి తర్వాత మాకు 50సీట్లు కూడా వద్దు మేం ఇచ్చే సీట్లు కూడా ఇవ్వం, మొత్తం సీట్లను వెనక్కి తీసేసుకోండని చెప్పిన పరిస్థితి ఉందన్నారు. ఈ కళాశాల రన్ అయ్యి ఉంటే కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాలకు ఎంతో మేలు జరిగి ఉండేదన్నారు. ఎంతో మంది డాక్టర్లు బయటకు వచ్చేవారన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఉద్యోగాలు ఇచ్చారని, అలాంటిది ఇప్పుడు మా ఇంట్లో నుంచి మమ్ములను తరిమేసినట్లుందని, ప్రైవేటీకరణ చేస్తారన్న భయంగా ఉందని సిబ్బంది తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అన్ని మంచి పనులు ప్రజలకు తెలియాలనే లక్ష్యంతో పులివెందుల నుంచి ప్రయాణం మొదలు పెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు.

రైతులపై కూటమి ప్రభుత్వం కక్ష

చక్రాయపేట : రైతుల పట్ల కూటమి ప్రభుత్వం కక్ష కట్టినట్లు ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల పేర్కొన్నారు.శుక్రవారం ఆమె చక్రాయపేట మండలంలో అర్థాంతరంగా ఆగిన కాలేటివాగు ప్రాజక్టును పరిశీలించారు. అక్కడికి వచ్చిన రైతులతో మాట్లాడారు. మండలంలోని అన్ని ఎకరాలకు సాగునీటిని అందించి రామాపురం,లక్కిరెడ్డిపల్లె, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లె తోపాటు కుప్పం నియోజకవర్గానికి నీటిని అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రు.5,300 కోట్లతో 0.25 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న కాలేటివాగు ప్రాజక్టును 1.2టీఎంసీలకు పెంచి నిధులు మంజూరు చేశారని చెప్పారు.ప్రాజక్టు పనులు సుమారు 90శాతం పూర్తయ్యాయన్నారు. భూములు కోల్పోయిన రైతులకు కూడా 80 శాతం మందికి పరిహారం అందించినట్లు చెప్పారు.మిగిలిన రైతులకు పరిహారం ఇచ్చి ఆగినపనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేయక వదిలేసిందంటే కక్ష సాధింపు కాక మరేమవుతుందని ప్రశ్నించారు. రైతులు పులివెందుల నియోజకవర్గానికి చెందిన వారైనందునే ఈప్రాజక్టు గురించి పట్టించుకోలేదని అర్థమవుతోందన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణం స్పందించి ప్రాజెక్టు పనులను పూర్తి చేసి రైతులకు అంకితం చేయాలని డిమాండ్ చేశారు.

పిఠాపురం పీఠాధిపతి సనాతన ధర్మం ఎక్కడ ?

వైఎస్సార్ జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన గండి వీరాంజనేయ స్వామి ఆలయం కుంభాభిషేకంలో జరుగుతున్న జాప్యంపై సనాతన ధర్మం అని చెప్పే పిఠాపురం పీఠాదిపతి పవన్ కళ్యాణ్ ఎందుకు నోరు మెదప లేదని ఆమె ప్రశ్నించారు. కాలేటివాగు ప్రాజక్టు పరిశీలించిన అనంతరం ఆమె గండి వీరాంజనేయ స్వామిని దర్శించుకున్నారు.అనంతరం గత ప్రభుత్వ హయాంలో సుమారు రు.25 కోట్లతో పనులు ప్రారంభించి సుమారు 90 శాతం పనులు పూర్తి చేశారని చెప్పారు. ఆలయం కుంభాభిషేకం చేసి భక్తులకు మూల విరాట్ దర్శనం కల్పించే అవకాశం ఉన్నప్పటికీ ఎందుకు జాప్యం చేస్తున్నారని పవన్ కళ్యాణ్‌ను ప్రశ్నించారు. తక్షణం కుంభాభిషేకం జరిపించి శ్రావణ మాసంలో వచ్చే లక్షలాది మంది భక్తులకు మూలవిరాట్ దర్శనం కల్పించాలని డిమాండ్ చేశారు. జగనన్న హయాంలో హిందూ ఆలయాలకు పెద్ద పీట వేశారని ఆమె చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బెల్లం ప్రవీణ్ కుమార్ రెడ్డి,జడ్పీటీసీ శివప్రాదరెడ్డి,సతీష్ రెడ్డి తనయుడు రోహాన్ నాగిరెడ్డి,జిల్లా కార్యదర్శి ఈశ్వరరెడ్డి,పార్టీనేతలు వెంకటసుబ్బయ్య, శంకర్‌రెడ్డి, కృష్ణా రెడ్డి,సుబ్బిరెడ్డి,సుధాకర్,ప్రతాప్,గండి చేర్మెన్ కావలి కృష్ణతేజ,శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పసిడిపురి వసంతోత్సవం

100 మందికి అయోధ్య బాలరామ అవార్డులు ప్రదానం



అయోధ్య బాలరామ అవార్డులను అందుకున్న విద్యార్థినులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో శనివారం నటరాజకళాక్షేత్రం నాట్య విశారద మోహిద్దీన్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పసిడిపురి వసంతోత్సవం ఉత్సాహంగా సాగింది. ప్రొద్దుటూరు, కడప, రాజంపేట, వేంపల్లె తదితర ప్రాంతాలకు చెందిన చిన్నారులు ఉత్సాహంగా ఈ వేడుకలో పాల్గొని తమ నాట్య నైపుణ్యంతో అందరిని అలరించారు. 100 మంది చిన్నారులకు ఈ సందర్భంగా అయోధ్య బాలరామ అవార్డులను, ప్రశంశా పత్రాన్ని పంపిణీ చేశారు. అలాగే పలువురు నాట్యగురువులకు 'నాట్య వతంస' అవార్డులను అందించి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా నాట్యగురువు మోహిద్దీన్ ఖాన్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షణలో భాగంగా తాము ఈ కార్యక్రమాన్ని 'పసిడిపురి వసంతోత్సవం 2025' పేరుతో ఘనంగా నిర్వహించామన్నారు. మానవ జాతి ఆవిష్కరించుకున్న అనేక కళల్లో నాట్యం ఒకటని నాట్యం ప్రాముఖ్యతను వివరించారు. ఇటీవలి కాలలో తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు సాంప్రదాయ నృత్యాలను నేర్పించేందకు ఆసక్తి కనపరుస్తుండటం సంతోషకమన్నారు. కళలను ఆదరించి పోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పలువురు చిన్నారులు చేసిన కూచిపూడి, భరతనాట్యం జానపద నృత్యం, సంగీతం, సెమిక్లాసికల్, సోలో, గ్రూప్ విభాగాలలో చిన్నారులు చేసిన నృత్యాలను ఆహుతులు ఆసక్తిగా తిలకించారు. అలాగే వేసవి శిక్షణా శిబిరంలో శిక్షణ పొందిన చిన్నారుల బృంద నృత్యం ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్శనగా నిలిచింది. ఉదయం ప్రారంభమైన ఈ వసంతోత్సవం వేడుక రాత్రి 9 వరకు జరిగింది. కార్యక్రమంలలో పలు ప్రాంతాలకు చెందిన నాట్య గురువులు, కళాకారులు, కళాభిమానులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి

జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

కడప అగ్రికల్చర్ : జిల్లాలో అనుకూలమైన కొత్త రకాల పంటలను ఎంపిక చేసుకుని నూతన వ్యవసాయ పద్ధతులు పాటింటి అధిక దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు సూచించారు. ఊటకూరు కృషి విజ్ఞానకేంద్ర వారు శుక్రవారం వైఎస్ఆర్ జిల్లా కడప మండలం నానపల్లిలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ద్వారా వ్యవసాయ శాఖ అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీంతోపాటు పచ్చి రొట్ట పైర్లు, జిప్సం మరియు జీవన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు నూతన వ్యవసాయ పద్ధతులు పాంటించి లాభదాయకమైన దిగుబడి వైపు సాగాలి అని తెలియజేశారు. భారత నూనె గింజన పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ మంగేష్ దుబే మాట్లాడుతూ ఖరీఫ్ పంటలు సాగు చేసే రైతులు శాస్త్రవేత్తల అధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులను సాధించాలని సూచించారు. ఊటకూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పంటలసాగులో కీలకం విత్తన ఎంపికేనన్నారు. విత్తన ఎంపికతోపాటు విత్తనశుద్ధి, దుక్కులు, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబాషిణి మాట్లాడుతూ సాధారణంగా సాగు చేసే ఉల్లి నుంచి వినూత్నమైన పంటలైన డ్రాగన్, అంజూరతోపాటు ఇతర పూల పంటల సాగును అలవర్చుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం ద్వారా రైతులకు అందిస్తున్న సూక్ష్మ నీటి పథకం, పాలిహౌస్ పథకాన్ని గురించి వివరించారు. పొద్దుటూరు పశు వైద్యకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటికి సంబంధించిన వ్యాధులు, టీకాల గురించి వివరించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ సాయి మహేశ్వరి, డాక్టర్ సురేష్ కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి నాగభూషణ్‌రెడ్డి, మండలం ఉద్యాన అధికారి సింధూరి, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువతికి తీవ్ర గాయాలు



గాయపడిన యువతిని పరిశీలిస్తున్న పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఒంటిమిట్ట రైల్వేస్టేషన్ పరిధిలోని ముకుందాశ్రమం వద్ద రైలు పట్టాలపై నడిచి వెళుతున్న ఆవారి చందు అనే యువతిని రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిందని ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, ఎర్రగుంట్ల, నందలూరు ఎస్ఐలు త్రివేణి తెలిపారు. స్థానికంగా ఉన్న శివాలయంలో అభిషేకం చేయాలని ఆ యువతి కుటుంబం భావించి పూజా సామగ్రికి సంబంధించిన వివరాలను సేకరించేందుకు యువతి శివాలయంకు వెళ్లిందన్నారు. తిరిగి వచ్చే సమయంలో ఈ ప్రమాదం జరిగిందన్నారు. సంఘటన స్థలం వద్ద ఫేస్ మాస్క్, పాదరక్షలను చూసి యువతిని గుర్తించామన్నారు. కుటుంబ సభ్యులు గాయపడిన యువతిని చికిత్స నిమిత్తం కడపకు, ఆ తర్వాత మెరుగైన వైద్య సేవల కోసం తిరుపతికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ కొంత మంది పట్టాలు దాటే సమయంలో ఇయర్ ఫోన్లు పెట్టుకుని పాటలు వింటూ వెళుతున్నారని, ఆ సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. అలాంటి చర్యలను విడనాడాలని ఆయన సూచించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు పతకం



విద్యార్థి జాన్ బెన్నిని అభినందిస్తున్న కరస్పాండెంట్ నితీష్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్–2025లో మార్షల్ ఆర్ట్స్(పెన్–కాక్ సిలాట్)లో కడప బాలాజీ ఎంబీఏ కళాశాల విద్యార్థి జాన్ బెన్ని బంగారు పతకం సాధించినట్లు కరస్పాండెంట్ లేవాకు నితీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జేఎన్‌టీయూ యూనివర్సిటీ తరఫున బాలాజీ ఎంబీఏ కళాశాల విద్యార్థి బంగారు పతకం సాధించడం తమకెంతో గర్వకారణమన్నారు. ఇందుకు విద్యార్థికి రూ. 10 వేలు నగదుతో సత్కరించామని తెలిపారు. జూన్‌లో వియత్నాంలో జరిగే మార్షల్ ఆర్ట్స్‌లో భారత్ తరఫున జాన్ బెన్ని పాల్గొంటాడని తెలిపారు. యూనివర్సిటీ ప్రొఫెసర్., స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జోజిరెడ్డి తమ కెంతో తోడ్పాటునిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ హిమ్మల్, హాకీ కోచ్ కళ్యాణ్ అభినందనలు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

మదనపల్లె రూరల్ : అదనపు కట్నం, కానుకల కోసం వేధిస్తున్న ముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ తెలిపారు. మదనపల్లె పట్టణం తాళ్ల సుబ్బన్న వీధికి చెందిన నజీరుల్లా, జుబేదా దంపతుల కుమార్తె ముస్కాన్(22)ను కర్ణాటక ఆర్‌కే.పురంకు చెందిన జలీల్‌అహ్మద్, షహీనా దంపతుల కుమారుడు షేక్ సల్మాన్‌కు ఇచ్చి 2022లో వివాహం జరిపించారు. ఏడాది నుంచి భర్త సల్మాన్, అత్త షహీనా, మేనత్త ఘాజియాలు అదనపు కట్నంతో పాటు బైక్ కొనివ్వాలని వేధించడం మొదలుపెట్టారు. దీంతో భరించలేక నెలరోజుల క్రితం ముస్కాన్ పుట్టింటికి వచ్చేసింది. విషయం తల్లిదండ్రులకు తెలిపి వారి సహాయంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. దీంతో నిందితులు ముగ్గురిపై కేసు నమోదుచేసి హెడ్‌కానిస్టేబుల్ చంద్రరాజు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అన్నమాచార్య యూనివర్సిటీ ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదల



వర్సిటీ ప్రవేశపరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న ప్రోచాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి తదితరులు

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు యూనవర్సిటీ ప్రొచాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఏయూలోని తన చాంబరులో ఏయూఈటీ –2025 మొదటి దశ ప్రవేశ ఫలితాలను ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూఈటీ ప్రవేశపరీక్ష ఈనెల 15న నిర్వహించామన్నారు. పరీక్షను మొత్తం 1908 మంది విద్యార్థులు రాశారన్నారు. అందులో 1239 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు. అర్హత సాధించిన విద్యార్థుల కోసం జూన్ 5, 6, 9, 10 తేదీలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అన్నమచార్య యూనివర్సిటీ జిల్లాలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందన్నారు. కార్యక్రమంలో వీసీ డా.సాయిబాబా, రిజిస్టార్ మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ నారాయణ, డా.జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కోసం వెళ్లి అనంత లోకాలకు..



పొలాల్లోకి దూసుకెళ్లిన కారు (ఇన్‌సెట్) మహమ్మద్ నవాజ్ (ఫైల్)

కురబలకోట : కురబలకోట మండలం జంగావారిపల్లె సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన కారు ప్రమాదంలో రాయచోటికి చెందిన యువకుడు షేక్ మహమ్మద్ నవాజ్ (23) మృతి చెందాడు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు..రాయచోటికి చెందిన సుహేల్ (24) కువైట్‌లో పని చేస్తూ స్వగ్రామం రాయచోటికి రావడానికి శుక్రవారం బెంగళూరు ఎయిర్ పోర్టులో దిగారు. ఇతన్ని తీసుకు రావడానికి రాయచోటికి చెందిన ఇతని స్నేహితులు మహమ్మద్ అలీ ఖాన్ (23), డ్రైవర్ ముజిమిల్ (24), ఖాదర్ బాషా (24), షేక్ మహమ్మద్ నవాజ్ (24) వెళ్లారు. వీరి స్నేహితుడు సుహేల్‌తో పాటు కారులో రాయచోటికి వస్తుండగా మార్గమధ్యంలో మండలంలోని జంగావారిపల్లె వద్ద రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారు ఒక్కసారిగా అదుపు తప్పి ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. రెప్పపాటులో జరిగిన ఈ సంఘటనలో షేక్ మహమ్మద్ నవాజ్ (24) మృతి చెందాడు. మిగిలిన వారికి గాయాలయ్యాయి. వీరిని 108 వాహనం హుటాహుటిన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాన్ని రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి పరామర్శించారు. స్నేహితుడి కోసం వెళ్లి రెప్పపాటున జరిగిన ప్రమాదంలో ఇతను మృతి చెందడం పట్ల రాయచోటిలో తీవ్ర విషాదం నెలకొంది.

ఖైదీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

– జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : కడప నగరంలోని పురుషుల కేంద్రకారాగారం, ప్రత్యేక మహిళా కారాగారంలతో పాటు రాయచోటిలోని సబ్ జైలును వైఎస్ఆర్ ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ తమ సిబ్బందితో శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను పరిశీలించడంతో పాటు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాన్నారు. మానసిక వ్యాధిగ్రస్తులైన ఖైదీలతో మాట్లాడారు. సకాలంలో డాక్టర్ సలహాలు తీసుకుంటూ మందులు వాడాలన్నారు. ఫిర్యాదుల పెట్టెను పరిశీలించారు. ప్రిజం లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం కల్పించారు. కార్యక్రమంలో పురుషుల కేంద్ర కారాగారము సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, ప్రత్యేక మహిళ కారాగారం సూపరింటెండెంట్, రాయచోటి సబ్ జైల్ సూపరింటెండెంట్, పానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

యోగాంధ్ర కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : ఈనెల 21 నుంచి జూన్ 21 వరకుయోగాంధ్ర- 2025 మాసోత్సవాల్లో నిర్వహించే అన్ని కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. నెల రోజుల పాటు ×యోగాంధ్ర- 2025పై నిర్వహించే వివిధ కార్యక్రమాలు, పీఎం–సూర్యఘర్ పథకం, ఎన్టీఆర్ వైద్యసేవలు, స్వచ్ఛఆంధ్ర, హరితాంధ్ర, హౌసింగ్ తదితర అంశాలపై శుక్రవారం సాయంత్రం అమరావతి నుండి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు జేసీ అదితిసింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ 11వ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో జరగబోయే కార్యక్రమంలో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొంటారని దీనికి రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మంది హాజరయ్యే లక్ష్యంతో అధికారులు ప్రజలను ప్రోత్సహించాలన్నారు. నెల రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ఒక్కొక్క రోజు ఒక్కో జిల్లాలో రాష్ట్రస్థాయి కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి జిల్లాలో ముఖ్యమైన పర్యాటక కేంద్రాలను గుర్తించి అక్కడ ప్రత్యేకంగా యోగా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రతి ఆదివారం ఉదయం పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని సంస్థాగత, పబ్లిక్ ప్రదేశాల్లో జిల్లాలో యోగా క్యాంపెయిన్ లను నిర్వహించాలన్నారు. యోగా శిక్షణ కోసం జిల్లాలోని ప్రజలందరూ రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జూన్ 10వ తేదీ వరకు ఆశక్తి కలిగిన ప్రజలు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సచివాలయ సిబ్బంది మీ ఇంటి వద్దకే వచ్చి రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, కేఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, సీపీవో హాజరతయ్య, డిపివో రాజ్యలక్ష్మి, డిఆర్డీఏ, డ్వామా, మెప్మా పీడీలు రాజ్యాలక్ష్మీ, అదిశేషారెడ్డి, కిరణ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సాగులో శాస్త్రీయత పెంపొందించుకోవాలి

– భారత నూనె గింజల పరిశోధనా శాస్త్రవేత్త ఖురేషి

నందలూరు : రైతులు సాగులో శాస్త్రీయత పెంపొందించుకోవాలని తద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని భారత నూనె గింజల పరిశోధనా శాస్త్రవేత్త ఖురేషి సూచించారు. శుక్రవారం మండలంలోని లేబాక, నల్లతిమ్మయ్యగారిపల్లె గ్రామాల నందు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ ద్వారా రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ మామిడి తోటల పెంపకం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి రామకృష్ణరాజు మాట్లాడుతూ మండలంలోని ప్రధాన పంట వరి పైరు గురించి వివిధ రకాల విత్తనాలు నారుమడి పెంపకం, ప్రధాన పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధిక దిగుబడి సాధించేందుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి మల్లిఖార్జున మాట్లాడుతూ రైతులందరూ విశిష్ట నమోదు సంఖ్య తీసుకోవాలని, ఇప్పటికీ తీసుకోని వారు త్వరగా నమోదు చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వం వారిచే రైతులకు ఇచ్చే పంట ద్వారా వారు వేసిన పంటను నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి సురేష్ బాబు, వైపి గిరీష్‌కుమార్, పామాయిల్ పంట అభివృద్ధి అధికారి కొండారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త